

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.30 (310.5510)	44,666	44,666
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	2,691.07	4,535.21
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.86 (45.56)	33,460	36,950

చికెన్ ధరలు | లైవ్: రూ.140 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240

కృష్ణమ్మ నీరు కడలిపాలు



- వానాకాలంలో సాగర్ గేట్ల నుంచి 435 టీఎంసీల నీరు విడుదల
- కాల్వలకు 69 టీఎంసీలు
- ఎగువ నుంచి వచ్చిన 840 టీఎంసీల వరద రాక
- విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,400 మిలియన్ యూనిట్లు
- ఇప్పటి వరకు 916.92మి.యూ ఉత్పత్తి

కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత ఏడాది సరిపడా వర్షాలు లేక ఎగువ నుంచి సాగర్ ప్రాజెక్టుకు ఎలాంటి వరద రాక లేదు. దీంతో ప్రభుత్వం సాగర్ ఆయకట్టులో క్రాప్ హాలిడే ప్రకటించింది. అయితే ఈ ఏడాది ఎగువన భారీ వర్షాలు కురవడంతో కృష్ణానది బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండటంతో ఈ ఏడాది జూలై 29వ తేదీ నుంచి సాగర్‌కు వరద రాక మొదలైంది. సాగర్ జలాశయం శరవేగంగా నిండటంతోపాటు ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో సాగర్ గేట్ల నుంచి మొత్తం 435 టీఎంసీల నీటిని విడుదల చేయగా, కృష్ణమ్మ వృథాగా కడలిపాలైంది.

- నాగార్జునసాగర్

ఈ ఏడాది జూలై 29కి ముందు సాగర్ నీటి మట్టం 506అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు కనిష్ఠ నీటి మట్టం స్థాయి 510 అడుగులు కాగా, ఈ ఏడాది కనిష్ఠ నీటిమట్టానికి దిగువకు నిల్వలు పడిపోయాయి. జూలై 29న సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో వారం రోజుల్లో ప్రాజెక్టు నీటిమట్టం 584 అడుగులకు చేరుకుంది. నీటి రాక కొనసాగడంతో ఎన్నెస్పీ అధికారులు ఆగస్టు 5వ తేదీన సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి వరద రాకను బట్టి గేట్ల సంఖ్యను పెంచుతూ మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఆ తరువాత వరద రాక తగ్గడంతో గేట్ల సంఖ్యను తగ్గిస్తూ ఈ నెల 19వ తేదీ వరకు క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేసి ఆ తరువాత గేట్లను మూసివేశారు.

నాలుగేళ్లుగా ఆగస్టులోనే క్రస్ట్ గేట్ల ఎత్తివేత

2019 నుంచి 2024 వరకు సాగర్ క్రస్ట్ గేట్లను ఏటా ఆగస్టు నెలలోనే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి విడుదల ఇలా..

సంవత్సరం	క్రస్ట్ గేట్లు ఎత్తిన తేది	నాటి నీటి మట్టం (అడుగుల్లో)
2019	ఆగస్టు 12	588.00
2020	ఆగస్టు 21	585.40
2021	ఆగస్టు 1	587.00
2022	ఆగస్టు 11	585.60
2023	గేట్లు ఎత్త లేదు	-
2024	ఆగస్టు 5	584.00

2019 నుంచి సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం (మిలియన్ యూనిట్లు)	ఉత్పత్తి
2019-20	1289	1,512.85
2020-21	1290	1,248.78
2021-22	1535	2,262.62
2022-23	1500	177.00
2023-24	1530	540.00
2024-25	1400	916.92

సాగర్‌కు 840 టీఎంసీల నీరు రాక

ప్రస్తుత నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31 వరకు) ఎగువ నుంచి సాగర్‌కు మొత్తం 840 టీఎంసీల వరద వచ్చి చేరింది. దీంతో సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా 435టీఎంసీల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 134.33టీఎంసీల నీటిని అధికారులు విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా 44 టీఎంసీలు, ఎడమ కాల్వ ద్వారా 25 టీఎంసీల నీటిని ప్రాజెక్టు అధికారులు సాగర్ నుంచి విడుదల చేశారు. సాగర్ నుంచి మొత్తం 638.33 టీఎంసీల నీటిని విడుదల చేయగా, ఎగువ నుంచి 840 టీఎంసీల నీరు సాగర్‌కు వచ్చి చేరింది. మొత్తం 435 టీఎంసీల నీరు వృథాగా సముద్రంపాలైంది.

916.92మి.యూ విద్యుత్ ఉత్పత్తి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు రెండేళ్ల తర్వాత ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వచ్చి చేరడంతో ఈ ఏడాది సాగర్ ఆయకట్టుకు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు సాగు, తాగు నీటి ఇబ్బందులు తీరినట్లే. అలాగే సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో కూడా గత ఏడాది వరద రాక లేక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో (ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు) జూలై 29వ తేదీ నుంచి సాగర్‌కు వరద రాక ప్రారంభంకావడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,400మిలియన్ యూనిట్లుగా కాగా, ఈ నెల 23వ తేదీ వరకు 916.92 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. అందుకు మొత్తం 134.33 టీఎంసీల నీటిని వినియోగించారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 8 టర్బైన్లు ఉండగా, మొదటి టర్బైన్ సామర్థ్యం 110 మెగావాట్లు కాగా, మిగిలిన ఏడు టర్బైన్లలో ఒక్కోటి సామర్థ్యం 100.8 మెగావాట్లు. రివర్సబుల్ పంపింగ్ విధానంలో ఇవి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 815.6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, 2వ నంబరు టర్బైన్ గత ఏడాది మరమ్మతులకు గురైంది. దీంతో ప్రస్తుతం ఏడు టర్బైన్ల ద్వారా మాత్రమే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇక ఎడమ కాల్వపై ఉన్న జలవిద్యుత్ కేంద్రంలో 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు టర్బైన్‌లు ఉన్నాయి. వీటికి ఈ ఏడాది లక్ష్యం 69మిలియన్ యూనిట్లు కాగా, ఈ నెల 23వ తేదీ వరకు 35.53 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. అందుకు 0.75 టీఎంసీల నీటిని వినియోగించారు.

మూసీ నుంచి 7.50టీఎంసీల నీటి విడుదల

కేతేపల్లి, సెప్టెంబరు24: మూసీ ప్రాజెక్టు వరుసగా నాలుగేళ్ల నుంచి నీటితో కళకళలాతుతోంది. ఏటా నవంబరు, డిసెంబరు నెల్లో పొంగిపొర్లే ఆనవాయితీ ఉన్న మూసీ ప్రాజెక్టు గత చరిత్రను తిరగరాస్తూ కొన్నేళ్లుగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి వచ్చే వృథా జలాలతో వేసవిలోనూ కళకళలాడుతూ కనిపిస్తోంది. దీనికి వేసవిలో వచ్చే అకాల వర్షాలు తోడవుతుండడంతో వానాకాలానికి ముందే ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టులోని 30వేల ఎకరాల పైచిలుకు భూముల్లో వానాకాలం, యాసంగి పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయినీటిమట్టం 645అడుగులు(4.46టీఎంసీ)లు ఉండగా,ఏటా వచ్చేవరదలకు గేట్లు ఎత్తడంతో మూసీ ప్రాజెక్టులో పట్టే రెండింతల నీరు దిగువకు వృథాగా వెళ్తోంది. ఈ ఏడాది సైతం హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో వానాకాలం సీజన్ ఆరంభం నుంచి రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసీకి ఉప నదులుగా ఉన్న ఆలేరు, బిక్కేరులతో పాటు చిన్నాచితక వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో వరదనీరంతా ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు వరద నీటిరాకడ ఈ ఏడాది కూడా భారీగానే ఉంది. ప్రాజెక్టులో నీటి వనరులు పుష్కలంగా ఉండడంతో వానాకాలం పంటల సాగుకు గత జూలై 25వ తేదీ నుంచి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని అందిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదలతో ఏటా ఈ ప్రాజెక్టులో నిల్వ సామర్థ్యానికి మించి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో అదంతా వృథాగా సముద్రం పాలవుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది సైతం మూసీకి వస్తున్న వరద నీటికి అనుగుణంగా అధికారులు ఇప్పటికే 24 రోజుల పాటు గేట్లను ఎత్తారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుండడంతో ప్రస్తుతం మూడు గేట్లను ఎత్తి 3,943 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి ఇప్పటి వరకు 24రోజుల పాటు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో సుమారు 7.50 టీఎంసీల నీరు వృథాగా వెళ్లింది. మరిన్ని రోజులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. మరోవైపు గత ఏడాది సెప్టెంబరు 15నాటికి గేట్ల ను ఎత్తడం ద్వారా 3.99టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.

సిబ్బంది కొరత

మూసీ ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది కొరత ఉంది. మొత్తం 119మంది సిబ్బందికి ఏఈలతో కలిపి కేవలం 34 మంది మాత్రమే ఉన్నారు. 33మంది గ్యాంగ్‌మెన్లకు 14మంది ఉన్నారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న క్రమంలో సదరు సమాచారం మూసీ పరివాహక గ్రామాలకు చేరడం లేదు. గత ఆదివారం రాత్రికి రాత్రి ఎగువ నుంచి వచ్చిన ఇన్‌ఫ్లోను దిగువకు వదిలే క్రమంలో అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల పైచిలుకు నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో భీమారం గ్రామంలో మూసీ నదిలోకి వెళ్లిన ఇసుక ట్రాక్టరు, కూలీలు, పశువులకాపరులను వరద చుట్టుముట్టింది.



- శాలిగౌరారంలో 8.35 సెంటీమీటర్లు
- నీటమునిగిన పంట పొలాలు

యాదాద్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి)/శాలిగౌరారం: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై, మధ్యాహ్నం, సాయంత్రంవేళ వాన పడింది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో అత్యధికంగా 8.35 సెం.మీలు, అత్యల్పంగా నాంపల్లి మండలంలో 0.17 సెం.మీల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా మద్దిరాలలో అత్యధికంగా 2.22 సెం.మీ.ల వర్షపాతం, అత్యల్పంగా నేరేడుచర్లలో 0.14 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలో అత్యధికంగా 7.93 సెం.మీ లు, అత్యల్పంగా రామన్నపేట మండలంలో 0.24 మి.మీల వర్షపాతం నమోదైంది. శాలిగౌరారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మం గళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం పడింది. భారీ వ ర్షానికి పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. వరి పొలాలు నీట మునిగాయి.విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గంటన్నర సేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి జన జీవనానికి తీవ్ర ఆటంకం కలిగింది. మంగళవారం రాత్రి భారీ ఈదురు గాలులు వీచడంతో అక్కడక్కడ చెట్లు నేలకూలి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచింది.

పెరిగిన భూగర్భ జలాలు

సూర్యాపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు అమాంతం పెరిగాయి. చింతలపాలెం మండలంలో గత ఏడాది ఆగస్టు నెలలో 14.34మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఈ ఏడాది మే నెల వచ్చే సరికి 7.47మీటర్లకు నీటిమట్టం చేరింది. మేళ్లచెర్వు మండలంలో 15.12 మీటర్ల లోతు నుంచి 6.33మీటర్లకు భూగర్భ జలాలు చేరాయి. జిల్లాలో సగటున భూగర్భజల మట్టం గతఏడాది ఆగస్టులో 5.31మీటర్ల లోతు కాగా, నవంబరులో 5.33 మీటర్లు, ఈ ఏడాది మే 24న 8.39మీటర్ల లోతు, జూలై నెలలో 7.20 లోతుకు చేరగా, భారీ వర్షాల కారణంగా ఆగస్టు నెలలో 5.97మీటర్ల లోతుకు చేరాయి.

రూ.1.50కోట్లతో నారాయణపురం చెరువుకట్ట మరమ్మతులు: మంత్రి ఉత్తమ్

చిలుకూరు, సెప్టెంబరు 24: మండలంలోని నారాయణపురం ఊరచెరువు కట్ట మరమ్మతు కోసం రూ.1.50కోట్లు మంజూరు చేశామని మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నారాయణపురం ఊరచెరువు కట్ట తెగడంతో మరమ్మతు పనులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. పదిరోజుల్లో చెరువు కట్టకు పడిన గండ్లను పూడ్చాలని అధికారులకు సూచించారు. చెరువు ఆక్రమణకు గురైందని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, కట్ట మరమ్మతులు పూర్తయిన అనంతరం ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మండలంలోని ఆర్లెగూడెం వద్ద రెడ్లకుంట మేజర్‌కు పడిన గండి ప్రాంతాన్ని మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. వారి వెంట సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ సత్యనారాయణ, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, తదితరులు ఉన్నారు.

నేడు సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

సూర్యాపేట: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ మెయిన్ కెనాల్‌కు పడిన గండి మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో బుధవారం నీటిని విడుదల చేయనున్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగితరామచంద్రాపురం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు ఈ నెల 1వ తేదీన గండి పడటంతో మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.2.10కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదలను నిలిపివేసి గండి పూడ్చివేత పనులు నిర్వహిస్తుండగా, మంత్రి ఉత్తమ్‌పనులను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి మరమ్మతు పనులు పూర్తయ్యాయి. బుధవారం సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయటంతో మునగాల హెడ్ రెగ్యులేటరీ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు చేరుకుంటాయి.



నారాయణపురంలో చెరువు మరమ్మతులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతి

మంత్రుల అత్యుత్సాహం వల్లే తెగిన కాల్వకట్టలు

మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 24: ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన మంత్రుల అత్యుత్సాహం, చేతగానితనం వల్లే నాగార్జునసాగర్ కాల్వకట్టలు తెగాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో జగదీష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్ విషయంలో రాష్ట్ర మంత్రులకు చిత్తశుద్ధి లేదన్నారు. మంత్రుల వైఫల్యాలను అధికారుల మీదనెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నాగార్జునసాగర్ కాల్వ గేట్ల లాక్‌లకు వెల్డింగ్ చేయడంతోనే వరదల సమయంలో అవి తెరుచుకోలేక కాల్వ కట్టలు తెగాయన్నారు. ప్రభుత్వ పాలసీవల్లే కాల్వల మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని దుయ్యబట్టారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన ఐదుగురు మంత్రులున్నా రైతుల పొలాలకు నీళ్లందడంలేదన్నారు. హడావుడిగా, నాసిరకంగా కాల్వకట్టల మరమ్మతుల పనులు చేయిస్తున్నారని తెలిపారు. కిందిస్థాయి అధికారుల మీద అరవడం మానుకుని పొలాలకు నీళ్లందించాలన్నారు. గతంలో కాల్వలు తెగితే వారంలో నీళ్లందించాలమని వివరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలకు ప్రజలకు అనుమానం కలుగుతుందన్నారు. కాల్వలు తెగడానికి ఎవరు కారణమో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక్క వ్యవస్థ సరిగ్గా పని చేయడంలేదని ఆరోపించారు. కాల్వలు తెగి 24 రోజులు గడుస్తున్నా పొలాలకు నీళ్లందించడంలేదన్నారు. తక్షణమే తెగిన కాల్వ కట్టలకు 24 గంటలు మరమ్మతు పనులు చేయించి వెంటనే పొలాలకు నీళ్లందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పుట్టా కిశోర్‌కుమార్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, తూడి నర్సింహారావు, భైరు వెంకన్నగౌడ్, తాహేర్‌పాష, బత్తుల ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని శిశుమందిర్ స్కూల్ సమీపంలోని 50 అడుగుల రోడ్డుపై గుంతలుపడి నీరు నిలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఈ రోడ్డుపై మంగళవారం ఇలా నాట్లువేసి నిరసన తెలిపారు.

● నేరేడుచర్ల

ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎస్.సుదర్శన్‌రెడ్డి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 24: ఓటరు జాబితా ప్రత్యేక సవరణను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎస్.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు జాబితా తయారీ కోసం చేపడుతున్న ఇంటింటి పరిశీలనతోపాటు ఫాం-6, 7, 8లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫొటో గుర్తింపు కార్డుల ప్రింటింగ్ కోసం సంబంధించిన వివరాలను పంపించాలన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా బీఎల్‌వోలు నూటికి నూరు శాతం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి లొకేషన్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 3న పబ్లిక్ నోటీస్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, ఈఆర్‌వోల నియామకంపై తక్షణమే ప్రతిపాదనలు పంపించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో వేణుమాధవ్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్‌అన్నారు. జిల్లాకేంద్రంలోని బీబీగూడెంలో గల శ్రీచైతన్య పాఠశాలలో ఐదు మండలాల డివిజన్‌స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లభాష నేర్చుకోవడంలో విద్యార్థులకు ఉన్న భయాలను తొలగించాలని, శిక్షణలో నేర్చుకున్న మెలకువలను ఉపాధ్యాయులు తరగతి గదిలో అమలుపర్చడం వల్ల ఆంగ్ల పదజాలం, మాతృభాషలో దాని అర్థం, ఉచ్చారణ, కమ్యూనికేషన్‌స్కిల్స్ పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి అశోక్, దేవరశెట్టి జనార్ధన్, గోపాలరావు, ఎస్‌వీ. గోమతి, హర్ష బాన్సలీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జాజిరెడ్డిగూడెంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించిన జడ్పీ సీఈవో అప్పారావు

జడ్పీ సీఈవో అప్పారావు

అర్వపల్లి, సెప్టెంబరు 24: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దోమల నివారణ కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రం చేయాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. అంతకుముందు గ్రామంలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లె దవాఖానాను, గ్రంథాలయాలను సీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీపీవో నా రాయణరెడ్డి, ఎంపీడీవో పవన్, డాక్టర్ నగేష్, ఏపీవో ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాలను జడ్పీ సీఈవో అప్పారావు పరిశీలించారు. మంగళవారం అర్వపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అర్వపల్లి, తిరుమలగిరి, మద్దిరాల, నాగారం, తుంగతుర్తి, నూతనకల్ మండలాల ఎంపీడీవోలతో నిర్వహించిన ఓటరు జాబితా సమావేశంలో సీఈవో మాట్లాడారు. ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించాలని తెలిపారు. సమావేశంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

చీడ పీడల నివారణపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్‌రెడ్డి



పెన్‌పహాడ్‌లో వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, సెప్టెంబరు 24: వరి పొలంలో చీడ పురుగుల నివారణపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చెందిన రైతులు దండంపెల్లి దేవేందర్, యర్రబోయిన సైదులు వరి పొలాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. వరిపొలంలో పురుగు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. ఆకుపచ్చ పురుగు నివారణకు దోమపోటు, కాండం తొలుచుపురుగు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వరి పొలంలో రోగాలకు సంబంధించిన మండలంలో ఉన్న ఏవో, ఏఈవోలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏవో బి.అనిల్‌కుమార్, ఏఈవోలు సంధ్య, రాకేష్ పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రాన్ని తనిఖీచేసిన పశుసంవర్ధకశాఖ అధికారి

కోదాడ రూరల్: మండల పరిధిలోని యర్రవరం ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యనాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా 90శాతం ఆడదూడలు పుట్టే అవకాశం ఉంటుందన్నారు. జాతీయ ఉచిత కృత్రిమ గర్భధారణ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.మధు, శరత్, నాగుల్‌మీరా, నలజాల రామారావు పాల్గొన్నారు.

క్లూఇచ్చిన ఆటోడ్రైవర్, పట్టించిన ఫోన్‌పే

చోరీకి పాల్పడిన ఐదుగురు అరెస్ట్ ● కేసును ఛేదించిన కోదాడ రూరల్ సర్కిల్ పోలీసులు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

●7లో..

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు


ఆంజనేయుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 24: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్ర రీతి లో నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కొండ పైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటికమూర్తులకు

» యాదగిరీశుని సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు

నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవ గామ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.10,23,465 ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు: ఈవో

భువనగిరి అర్బన్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, వాటి సంరక్షణ అందరి బాధ్యత అని యాదగిరిగుట్ట ఎస్పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్, ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు అన్నారు. యాదగిరిగుట్ట ఆలయ పరిధిలో మల్లాపురంలోని ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో గోశాలలో మంగళవారం వన మహోత్సవంలో మాట్లాడారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ డీ.ఆర్.ఎల్ రాజు, యాదగిరిగుట్ట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్, ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.


గోశాలలో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

లక్ష్మీవైష్ణవశర్మకు వేద పండిత పట్టా

నకిరేకల్, సెప్టెంబర్ 24 : నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణానికి చెందిన సుద్దాల లక్ష్మీ వైష్ణవశర్మ చిన్న వయస్సులో వేద పండిత పట్టాను అందుకున్నారు. ఈ నెల 17 నుంచి 21వ వరకు సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శృంగేరిశంకర మఠం సద్గురు సదనంలో వేద విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులు కావడంతో పట్టా అందుకున్నట్లు చెప్పారు. వివిధ వేదాల్లో పరీక్షలు నిర్వహించారని ఆయన తెలిపారు. లక్ష్మీ వైష్ణవశర్మను జిల్లా చేబియం రాఘవశర్మ పండితులు, పలువురు అభినందించారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం


క్రీడ జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కన్జర్వేటర్ శివానీడోగ్రా

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24 : క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి శివాని డోగ్రా అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ర్వహిస్తున్న యాదాద్రి జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిత్యం ఒత్తిడితో విధుల్లో ఉంటున్న ఉద్యోగులకు ఇలాంటి క్రీడా పోటీలు మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయన్నారు. ఈ పోటీల్లో యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట, జనగాం జిల్లాల నుంచి సుమారు 210 మంది ఫారెస్టు ఉద్యోగులు పాల్గొన్నారు డీఎఫ్‌వో రాజశేఖర్ మా ట్లాడుతూ పోటీల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, షార్ట్‌పుట్, అవుట్‌షుట్, క్యార మ్, చెస్ పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొనారు. కార్యక్రమంలో ఎఫ్ఏ వో నాగభూషణం, ఎస్ఆర్‌డీవో వీరేంద్ర బాబు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో కత్తిపోట్ల ఘటనలో

ఇరువర్గాలపై కేసు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 24 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సోమవారం రాత్రి పట్టణానికి చెందిన వ్యక్తులపై కత్తులతో దాడి ఘటనలో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన ఎండీ పార్థిన్ (25), ఎండీ అమీర్(24), మహ్మద్ షారూఖ్ (24), ఎండీ ఖాజా(24), ఎండీ మీరాజ్(23), ఎండీ సలీం వేర్వేరు వృత్తుల్లో కొనసాగుతున్నారు. చౌటుప్పల్ పట్టణంలోని బంగారిగడ్డలో ఉంటున్న తమ బంధువు షేక్ నూమన్ ఇంటికి సోమవారం ఉదయం వచ్చారు. అనంతరం అందరూ కలిసి స్థానిక ఓ వెంచర్‌లో మద్యం తాగారు. ఆ తర్వాత చౌటుప్పల్ 9వ వార్డు శివాజీనగర్‌లో కారు ర్యాష్ డ్రైవింగ్ చేశారు. ర్యాష్ డ్రైవింగ్‌పై స్థానిక కౌన్సిలర్ హిమబిందు భర్త అరుణ్‌కుమార్, స్థానికులు నిందితులను నిలదీయడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత నిందితులు మైత్రి వనంలో ఉంటున్న బంధువు ఓ మహిళ ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో స్థానికులు పెద్దఎత్తున నిందితులను బైక్‌పై వెంబడించిన కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో నిందితులు అరుణ్‌కుమార్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్గి సురేందర్‌ను కత్తులతో పొడిచారు. పార్థిన్, అమీర్‌ను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. నలుగురు పరారయ్యారు. పరారీలో ఉన్న నలుగురిని మంగళవారం బంగారిగడ్డలో పట్టుకున్నారు. కాగా, కత్తుల దాడిలో అరుణ్‌కుమార్, సురేందర్ హైదరాబాద్‌లోని సాయి సంజీవిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.స్థానికుల చేతిలో తీవ్రంగా గాయపడిన పార్థిన్, అమీర్ కామినేని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. నలుగురి నిందితులు షేక్ నూమన్, షారూఖ్,ఎండీ ఖాజా, మిరాజ్‌ను చౌటుప్పల్‌కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదుచేసినట్టు సీఐ తెలిపారు. నిందితులు ఉపయోగించిన కారు, కత్తులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కాగా, నిందితులను తీవ్రంగా కొట్టిన స్థానిక యువకులు మలిగే నవీన్, మలిగే సంతోష్, మలిగే రవి, మలిగే మహేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.నిందితులను నల్లగొండ సబ్‌జైలుకు తరలించారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

● నిందితుడి అరెస్టు.. ● యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన

భువనగిరి రూరల్, సెప్టెంబరు 24: మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని ఓ గ్రామంలో మానసిక దివ్యాంగురాలైన యువతి(మూగ, 20) ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 17వ తేదీ సాయంత్రం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఆమెను ఇంటి పక్కనే నివాసం ఉంటున్న బైక్ మెకానిక్ జమ్ముల మధు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గమనించిన అదే కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ఇంటి తలుపులు తెరవాలని అరిచారు. దీంతో ఆ యువకుడు ఇంటి వెనుక నుంచి పారిపోయాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబసభ్యులు బుధవారం భువనగిరి రూరల్ పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఆ యువతిని హైదరాబాద్ మలక్‌పేటలోని వెల్ఫేర్ ఆఫ్ డిడేబుల్ కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ కార్యాలయ మూగ చెవిటికి సంబంధించిన నిపుణుల వద్ద ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఆమె వెల్లడించిన ఇంటర్‌ప్రిటర్ ఆధారంగా అతనిపై అత్యాచారం కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

భువనగిరి టౌన్, సెప్టెంబర్ 24: రెండు రోజులుగా కనిపించకుండా పోయిన యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణం తాతానగర్‌కు చెందిన ముదిగొండ రాజ్‌కమల్(23) మంగళవారం భువననగిరి పెద్దచెరువులో మృతదేహమై తేలాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమం అనంతరం అదే రోజు సాయంత్రం బైక్‌పై వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో, పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ దొరక లేదు. దాంతో కుటుంబసభ్యులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక పెద్దచెరువులో తేలిన మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని వెలికితీయగా రాజ్‌కమల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారణ అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


రాజ్‌కమల్(ఫైల్)

వ్యాపారిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

నేరేడుచర్ల, సెప్టెంబరు 24: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి తీవ్రంగా గాయపరిచి అతడి వద్ద రూ.8వేల నగదు అపహరించుకు పోయారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన సిరికొండ నవీన్ నేరేడుచర్ల మున్సిపల్ రహదారిలో మహాలక్ష్మి పెయింటింగ్ దుకాణం నడుపుతున్నాడు. సోమవారం రాత్రి దుకాణం బంద్ చేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో పెంచికల్‌దిన్నె గ్రామ సమీపంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు రెండు బైక్ లపై వచ్చి నవీన్ వాహనాన్ని అడ్డగించారు. కల్లూరు గ్రామానికి రహదారి ఎటు వైపు అని అడుగుతూ దగ్గరికి వచ్చి దుండగులు నవీన్ జేబులో ఉన్న నగదును తీసుకునే ప్రయత్నం చేశారు. దాంతో నవీన్ ప్రతిఘటించడంతో అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అనంతరం నవీన్ వద్ద ఉన్న రూ. 8 వేల నగదును సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. కొద్ది దూరం వెళ్లి తర్వాత సెల్ ఫోన్ ధ్వంసం చేశారు. అనంతరం అటుగా వచ్చిన ప్రయాణికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, పాలకవీడు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, లక్ష్మీనర్సయ్య చేరుకొని విచారణ చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలిస్తూ నిందితులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ఆసుపత్రికి తరలించారు.

సారా తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 24 : సారాను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన భూక్యా వస్రం బైక్‌పై తరలిస్తున్న 16 లీటర్లు, బాలూ నాలుగు లీటర్ల సారా తరలిస్తుండగా చింతిర్యాల వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చింతలపాలెం మండలం పీక్లానాయక్‌తండాకు చెందిన బాణోత్ సక్రూ బైక్ 8 లీటర్లు, మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన హుసన్‌మీరా బైక్‌పై తరలిస్తున్న 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు దివ్య, జగన్‌రెడ్డి, నాగరాజు, రవి, రుక్మారెడ్డి, ధనుంజయ్, అంబేద్కర్, బాలు పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

ఆత్మకూరు(ఎస్), సెప్టెంబరు 24: సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని మంగలితండా గ్రామపంచాయతీ ఆవాసతండాలు ఈర్యతండా, కర్రోనితండాలో మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించిన అక్రమంగా నిల్వ ఉంచిన 25 క్వింటాల నల్లబెల్లం, 60 కిలోల పటిక, 5 లీటర్ల సారా, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు. వీటితో పాటు నల్లబెల్లం తరలిస్తున్న వీర్యతండాకు చెందిన గుగులోతు ఆలేందర్‌ను అదుపులోకి తీసుకోగా జాజిరెడ్డిగూడెం మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన లూనావత్ తండాకు చెందిన వెంకన్న, కర్రోనితండాకు చెందిన గుగులోతు లింగ్యాలు పరారైనట్లు తెలిపారు. బెల్లం, పటిక, సారాను స్వాధీనం చేసుకొని ఆలేందర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

రాయినిగూడెంలో పుస్తెలతాడు చోరీ

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 24 : సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెంలో సోమవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి శివాని భర్త నాగరాజు వినాయకుడి నిమజ్జనం కోసం విజయవాడకు వెళ్లాడు. దాంతో ఆమె అత్త, మామలతో కలిసి ఇంట్లో ఉన్న వరండాలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి 1.30 సమయంలో ఇంటి ప్రహరీ దూకి ఇంట్లోకి ప్రవేశించారు. శివాని మెడలో నుంచి 3.5తులాల పుస్తెలతాడును లాక్కొని వెళ్తుండగా అరవడంతో అత్తమామలు లేచి పట్టుకోవడానికి దొంగలతో పాటు పరిగెత్తారు. అనంతరం రోడ్డుపై సిద్ధంగా ఉంచుకున్న బైక్‌పై దుండగులు పారిపోయారు. వెంటనే రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అదే రాత్రి రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎమ్మార్పీ వరదకాల్వకు నీరేదీ?

● డీ-37పై అక్రమంగా తూములు
● నిలదీస్తే దౌర్జన్యం చేస్తున్నారంటున్న రైతులు
● ఎండుతున్న పంట పొలాలు

కాల్వలు ఉన్నా నీరందక చివరి భూములు బీళ్లుగా మారుతున్నాయి. ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరున్నా అధికారుల నిర్లక్ష్యంతో సాగునీటికి రైతులు నోచుకోవడం లేదు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో వరద కాల్వలు పూర్తయి ఏళ్లు గడిచినా నీళ్లందకపోవడం అధికారుల తీరుకు అద్దంపడుతోంది. ఇది ఆయకట్టు చివరి రైతులకు శాపంగా మారింది. మండలంలోని ధర్మాపురం, గోపాలపురం, కన్నెకల్, కేశవాపురం గ్రామాల రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

- మాడ్గులపల్లి


సాగునీరు పారక పిచ్చిమొక్కలతో ఉన్న డీ-37 కాల్వ

నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద ఎస్ఎల్‌బీసీ డీ-37 కాల్వ ప్రారంభమై కనగల్, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ వరకు సుమారు 27.05 కిలోమీటరు వరకు విస్తరించి ఉంది. సుమారు 42వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించడంతో పాటు 19 చెరువులను నింపేందుకు ప్రభుత్వం ఈ కాల్వ నిర్మించింది. ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీటి విడుదల ఆగస్టులో ప్రారంభించినా నేటికీ చివరి భూములకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వ నీటి కోసం రాత్రి వేళల్లో రైతులు గస్తీ కాసినా నీరు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం, బోరుబావుల మీద ఆధారపడి రైతులు వరి సాగు చేశారు. సాగు కోసం అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. బోరుబావులు అడుగంటి పంట చేతికొస్తుందో లేదోనని ఆందోళనలో ఉన్నారు. ఆయకట్టులోని బత్తాయి తోటలు భూగర్భజలాలు అడుగంటి దెబ్బతింటున్నాయి. కాల్వలో నీటివిడుదల సామర్థ్యాన్ని పెంచితే చివరి భూములకు నీరందడంతో పాటు భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. డీ-37 కాల్వ ద్వారా నీరు చివరి భూములకు అందడం లేదని రైతులు కొన్నిరోజుల క్రితం కాల్వలో దిగి నిరసన వ్యక్తం చేసినా ఫలితం శూన్యమని ఆరోపిస్తున్నారు.

కాల్వకు అక్రమ తూములు

మండలంలో అన్నారం, బసిరెడ్డిపల్లి, ముశంపల్లి, ఎల్లపల్లి గ్రామాల రైతులు డీ-37 కాల్వకు ఎక్కువగా అక్రమ తూములు ఏర్పాటుచేసి రాత్రి వేళల్లో నీటిని తరలిస్తున్నారు. దిగువన రైతులు ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తూ నీరు రానీయకుండా ఇబ్బందులకు గుర్తిచేస్తున్నారని చివరిభూముల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, మాచినపల్లి, కన్నెకల్, కేశవాపురం గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా కాల్వలో చెత్తాచెదారం, రాళ్లు, పిచ్చిమొక్కలు ఉండి దిగువకు నీరు అందకపోవడంతో బోరు బావుల ఆధారంగా కొందరు రైతులు 1000 ఎకరాల్లో వేసుకున్న వరి, బత్తాయి తోటలు ఎండిపోయే దుస్థితికి చేరుకున్నాయి. డీ-37 కాల్వ ద్వారా చివరి భూముల వరకు సజావుగా నీరందిస్తే గ్రామాల్లోని చెరువులు నిండటంతో పాటు వేల ఎకరాల్లో పంటలను, తోటలను కాపాడుకోవచ్చని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల పర్యవేక్షణ చేసి అక్రమంగా ఏర్పాటుచేసిన తూములను తొలగించి చివరి భూములకు నీరందించాలని పలుగ్రామాల రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని పలువురు పేర్కొంటున్నారు.

చివరి భూములకు నీరందడం లేదు



సాగర్‌లో నీరు పుష్కలంగా నీరుఉన్నా డీ-37 కాల్వ ద్వారా చివరి భూములకు నీరందడం లేదు. దీంతో మేం ఇబ్బందులు పడుతున్నాం. నీటి కోసం అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. కాల్వకు నీటి విడుదల కొనసాగినా ఇప్పటివరకు చివరి వరకు రావడంలేదు. అధికారులు స్పందించి నీరందేలా కృషి చేయాలి.

-జూలకంటి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, మాచినపల్లి

రెండు, మూడు రోజుల్లో నీరందిస్తాం



డీ-37 కాల్వ ద్వారా చివరి భూములకు రెండు, మూడు రోజుల్లో నీరు అందిస్తాం. హైలెవల్ నుంచి నీరు తక్కువగా రావడంతో చివరి భూములకు నీరందడం లేదు. ప్రస్తుతం కాల్వ 24 కిలోమీటర్ల వరకు నీరు వచ్చాయి. వారబందీ విధానంలో నీటి విడుదల కొనసాగుతోంది. ఖచ్చితంగా చివరి భూములకు నీరందించేందుకు కృషి చేస్తాం. రైతులెవరూ అధైర్యపడొద్దు.

- సంపత్, డీఈ, ఇరిగేషన్

క్లూఇచ్చిన ఆటోడ్రైవర్... పట్టించిన ఫోన్‌పే

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 24 : ఆటోడ్రైవర్ అందించిన సమాచారం ఓ చోరీకి కేసును ఛేదించింది. నిందితులు వాడిన ఫోన్‌పే వారిని పట్టించింది. చోరీకి పాల్పడిన ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ సర్కిల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డ్రైవర్‌గా పనిచేసే వేమవరపు నాగరాజు చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెంలో బంధువుల ఇంటికి వచ్చివెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆయనకు మేళ్లచెర్వుకు చెందిన మిర్చి వ్యాపారి వేముల వెంకటేశ్వర్లుతో పరిచయమైంది. డబ్బులు అవసరం కాగా నాగరాజు ఎక్కడైనా చోరీ చేయాలని భావించి ఆ విషయాన్ని వెంకటేశ్వర్లుతో చర్చించాడు. అందుకోసం వెల్లటూరుకాలనీలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు నివాసంలో చోరీ చేయాలని, సుమారు రూ.30 లక్షల వరకు డబ్బు లభిస్తుందని నాగరాజు భావించాడు. చోరీ చేసేందుకు పాతమిత్రులైన నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మాత్రు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు పుల్లారావు, భిక్షం, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కుల ఆంజనేయులను సంప్రదించాడు. అందరూ కలిసి ఈ నెల 19న తెల్లవారుజామున 3 గంటల సమయంలో వెంకటేశ్వర్లు ఇంట్లోకి చొరబడి అతడితో పాటు ఇద్దరు కుమార్తెలను కత్తులతో బెదిరించారు. వారి నుంచి సుమారు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దోపిడీ జరిగిన ఇంటిని ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ, కోదాడ డీఎస్పీ పరిశీలించారు. కేసును ఛేదించేందుకు ఏడు పోలీస్ బృందాలను ఏర్పాటుచేశారు. విచారణలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పోలీసులకు కీలక సమాచారమిచ్చాడు. నేరానికి పాల్పడిన వ్యక్తులు మేళ్లచెర్వు వద్ద మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి వారి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించారని, నేరస్తులు ఉపయోగించిన కారు ఢిల్లీ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉందని తెలిపాడు. దీంతో పోలీసులు ఆ దిశగా టెక్నాలజీ సాయంతో విచారణ చేసి నేరానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించారు.

వాహన తనిఖీ చేస్తుండగా

వెల్లటూరుకాలనీలో నేరానికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులు మంగళవారం కారులో వెళ్తుండగా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తన సిబ్బందితో అనంతగిరి మండలం శాంతినగర్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా వెల్లటూరుకాలనీలో వెంకటేశ్వర్లు నివాసంలో చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో నిందితుల నుంచి సుమారు రూ.6.38 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలతో పాటు నగదు, ఇన్నోవా కారు, ఐదు కత్తులు, చేతి గ్లౌజులు, మాస్కులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నేరస్తులకు సహకరించిన మిర్చి వ్యాపారి వెంకటేశ్వర్లు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. నేరస్తులను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. అదేవిధంగా కీలక సమాచారం ఇచ్చిన ఆటోడ్రైవర్‌ను సన్మానించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, మేళ్లచెర్వు, అనంతగిరి, కోదాడ రూరల్, చింతలపాలెం ఎస్ఐలు పరమేష్, నవీన్‌కుమార్, అనిల్ రెడ్డి, సైదిరెడ్డితో సిబ్బంది ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

నిందితులపై కేసులు

నిందితుల్లో ఒకరైన నాగరాజుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఇసుక అక్రమ రవాణా, వీర్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలింపు, ఖమ్మం జిల్లా మధిర పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులు గతంలో నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. అదేవిధంగా రమావత్ మాత్రుపై రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట పరిధిలో మూడు దొంగతనం కేసులు, ఇబ్రహీంపట్నం, ఉప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో దొంగతనం కేసు, చింతపల్లి పరిధిలో రెండు చోరీ కేసులు ఉన్నాయన్నారు.



మైకంలో ప్రేమ పక్షులు

ఆహ్లాదం పంచాల్సిన పార్కులు కొద్దిమంది ప్రేమికులకు అడ్డాగా మారుతున్నాయి. దీంతో ఉపశమనం కోసం వస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో 10కి పైగా పార్కులు ఉండగా, ప్రత్యేకించి పలుచోట్ల ప్రేమికుల విచ్చలవిడి తనానికి నిలయాలు మారుతున్నాయి. పార్కులలో జన సంచారం ఉన్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా ప్రేమికులు వ్యవహరిస్తున్నారు. ప్రేమజంటలు తమ లోకంలో విహరిస్తుండగా మరికొందరు ఇదేఅదనుగా ఆయా జంటలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. ఇది ఆయా జంటల భవిష్యత్‌కు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు పార్కుల పర్యవేక్షణపై శ్రద్ధ చూపాలని, పోలీసులు కూడా తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- భువనగిరి టౌన్,

త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 24 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ నుంచి వెళ్తున్న త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని భూనిర్వాసితులు కోరారు. మంగళవారం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులను చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూనిర్వాసితులు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఓఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉండవల్సిన త్రిపుల్‌ఆర్‌ను నిబంధనలకు విరుద్ధంగా 28 కిలోమీటర్ల దూరం నుంచే ఏర్పాటుచేయడం సరికాదన్నారు. అన్ని రకాల నిబంధనలను పరిగణలోకి తీసుకొని త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని వారు కోరారు.


ఎంపీ రఘునందన్‌రావులకు వినతిపత్రాలను అందజేస్తున్న భూనిర్వాసితులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


వీరవెల్లి వద్ద ప్రమాదంలో నుజ్జయిన బొలెరో, పొలాల్లోకి వెళ్లిన ఆటో

భువనగిరి రూరల్, సెప్టెంబరు 24 : అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న బొలెరోను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి వద్ద మంగళవారం జరిగింది. వలిగొండ మండలం పులిగిల్లకు చెందిన వేముల రాజు ఆటోలో భువనగిరి నుంచి మోటకొండూరు మండలం చాడ గ్రామానికి ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నాడు.ఈ క్రమంలో గుండాల మండలానికి చెందిన దాసి యుగేందర్ కారులో వేగంగా వెళ్తూ ఆటోను ఢీకొట్టి ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా మోత్కూరు నుంచి రాయిగిరి వైపు వస్తున్న బొలెరోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో సమీప వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. బొలేరో డ్రైవర్ ఎస్‌కే రసూల్‌కు గాయాలు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ వేముల రాజు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ యుగేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

బస్ టైర్ కింద పడి గాయాలు

డిండి : నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు టైర్ కింద పడి ఓ వ్యక్తి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. డిండికి చెందిన సింగజోడి సత్యనారాయణ దేవరకొండలో ఉంటున్నాడు. పనినిమిత్తం దేవరకొండ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా జిల్లా అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో డిండికి వచ్చాడు. బస్సు దిగే క్రమంలో పడిపోగా, డ్రైవర్ గమనించక బస్సును ముందుకు పోనిచ్చాడు.ఈ క్రమంలో బస్సు వెనుక టైర్ కాలుమీద నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం ఆయన్ను హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మద్దిరాలలో ఒకే రోజు ఇల్లు కూల్చివేత, వాహనాల దగ్ధం

మద్దిరాల, సెప్టెంబరు 24 : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇల్లు కూల్చివేయడంతో పాటు ఎక్స్‌కవేటర్‌తో పాటు బొలెరో వాహనాన్ని దగ్ధం చేశారు. ఎస్ఐ వీరన్న, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నపుల్ల మల్లారెడ్డి, వల్లపు రమేష్ మధ్య కొన్నేళ్లగా భూతగాదాలు జరుగుతున్నాయి. కేసులు కోర్టులో చివరి దశలో ఉన్నాయి. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి మల్లారెడ్డి ఇంటిని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. అదే రాత్రి వల్లపు రమేష్‌కు చెందిన ఎక్స్‌కవేటర్, బొలెరో వాహనాన్ని కూడా దగ్ధం చేశారు. ఈ ఘటనపై ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ వీరన్న ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 15 ఏళ్లుగా ఇరువురి మధ్య భూతగాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో తగాదాలు తారస్థాయికి చేరాయని గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మఠంపల్లి, సెప్టెంబరు 24: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్ఐ సీతారామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం గ్రామానికి చెందిన త్రిపురం సతీష్‌రెడ్డి(36) ఆ గ్రామ రెవెన్యూలో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని, ఎకరంన్నర పొలంలో పత్తి, మరో ఎకరంన్నర పొలంలో మిరప సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం పైరుకు పురుగు మందును పిచికారీ చేసేందుకు నీటి కోసం మోటారు వద్దకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసే క్రమంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైరు గమనించని సతీష్‌రెడ్డి ప్రమాదవశాత్తు వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అప్పటివరకు పొలెంలో అందరినీ పలకరిస్తూ వ్యవసాయ పొలానికి వెళ్లిన సతీష్‌రెడ్డి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సతీష్‌రెడ్డికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.


సతీష్‌రెడ్డి(ఫైల్ ఫొటో)

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు ఐటీఐ ప్రిన్సిపాల్ బీ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రెండు ఫిట్టర్, 34 కోపా్ట్రేడ్, 34 వెల్డర్, 32 సోలార్ టెక్నీషియన్, 47 ఐఓటీ టెక్నీషియన్(స్మార్ట్ సిటీ)కి సంబంధించిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రింటెడ్ దరఖాస్తులు, అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలను ఈ నెల 25 నుంచి 28 వరకు ఉదయం 11గంటలకు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దవూర, సెప్టెంబరు 24: నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి చెందిన మట్టపల్లి గురువారెడ్డికి పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేత కోసం వెళ్లి పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న సెల్ టవర్ దగ్గర ట్రాన్స్‌ఫార్మర్‌కు గేదె తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.95వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

వలిగొండ, సెప్టెంబరు 24 : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం వెంటనే కమిటీ వేయాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించిన విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా గుర్తించాలన్నారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమకారును ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ ప్రధాన కార్యదర్శి జోగు అంజయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గంధమల్ల మల్లమ్మ, సీనియర్ నాయకులు శీలం స్వామి, గంధమల్ల బాలయ్య, కదిరేణి స్వామి, పబ్బు లక్ష్మయ్య, కీర్తి కళమ్మ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

చిన్నపాటి వర్షం కురిసినా బురదే

● అధ్వానంగా అంజనాపురి కాలనీ ● పాములు, కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

సూర్యాపేట రూరల్, సెప్టెంబరు 24: పట్టణంలో జాతీయ రహదారి పక్కను ఉన్న అంజనాపురి కాలనీ అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోని వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇళ్లలోకి పాములు, క్రిమికీటకాలు వస్తున్నాయి, తాము పట్టణంలో నివసిస్తున్నామా? గ్రామంలో ఉంటున్నామా? అర్థం కావడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నుంచి బయటికి వెళితే ఇబ్బందులే..

వర్షం కురిస్తే ఈ కాలనీ ప్రజలు ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు (ఫైల్)

ఇబ్బంది పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు 1,2,3,4 వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఆ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు. ఎన్నికల తర్వాత రోడ్డు నెంబరు ఒకటిలో సగం సీసీ రోడ్డు వేసి పనులు ఎందుకు నిలిపివేశారో అర్థంకావడం లేదని కాలనీవాసులు తెలిపారు. అధికారులను అడిగితే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెబుతున్నారన్నారు. అంజనాపురికాలనీ నుంచి జనగాం రోడ్డు వరకు రూ.కోటి వ్యయంతో గత ఏడాది సీసీ రోడ్డు నిర్మించారని, వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వరదనీరు దిగువకు వెళ్లేలా గూనలు వేయనందున, వరద సమయంలో నీరు దిగువకు వెళ్లకుండా ఇళ్ల ఎదుట నిల్వ ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల మునిసిపల్ కమిషనర్‌ను కోరగా, చెరువుల్లో, పొలాల్లో ఇళ్లను నిర్మించుకుంటే ఎలా రోడ్లు వేస్తామని అన్నారని తెలిపారు. కాలనీ వెనుక .మూసీ కాల్వకు అనుకుని ఉన్న పెద్ద పెద్ద విల్లాలకు మునిసిపల్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని, ఎలా బీటీ రోడ్డు నిర్మించారని అంజనాపురి కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ చెరువు, పొలాల్లో ఉంటే ఇళ్ల నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారో చెప్పాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

కాలనీలో ముఖ్యంగా మురుగు నీరు సాఫీగా వెళ్లడానికి రోడ్ల వెంట డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



అంజనాపురి కాలనీలో నిల్వ ఉన్న వర్షపు నీరు

కాలనీని అభివృద్ధి చేయాలి



అంజనాపురి కాలనీని అధికారులు అభివృద్ధి చేయాలి. అగిన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తే మరుసటి రోజు మునిసిపల్ సిబ్బంది వచ్చి ఓ వీధిలో పిచ్చి మొక్కలు పీకి వెళ్లారు. కాలనీలో పాములు, కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది, అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలి

● చెరుకు ఏకలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు, అంజనాపురి కాలనీ

ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

కోదాడ, సెప్టెంబరు 24: పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లోని ప్రైమరీ స్కూల్‌లో టాయిలెట్స్ నిర్మించాలని పాఠశాల హెచ్‌ఎం పి.వరమ్మ కోరారు. ఈ మేరకు మంగళవారం కోదాడలో మాజీ సర్పంచ్ పారా సీతయ్య నివాసంలో ఎమ్మెల్యే పద్మావతికి వినతిప్రతం అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి పంచాయతీ ఏఈ రాముని పిలిచి పనులను అంచనా వేసి తనకు ఫైల్ పంపాలని, వెంటనే చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుండెల సూర్యనారాయణ, మురళి సైరా నాయక్, తోట శ్రీనివాస్, పాలూరి సత్యనారాయణ, బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సూర్యం కృషి



వరప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘ చైర్మన్ నంబూరి సూర్యం

కోదాడ రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని కాపుగల్లు సహకార సంఘ అభివృద్ధికి చైర్మన్ నంబూరి సూర్యం ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. కాపుగల్లు గ్రామంలో వరప్రసాద్‌రెడ్డిని పలువురుసన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యం, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, లక్ష్మణ్‌రావు, రాజు, రామారావు పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని కాపుగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని అ సంఘం అధ్యక్షుడు నంబూరి సూర్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి జానీమియా ప్రారంభించిన ఈ కార్యక్ర మంలో సంఘ పరిధిలోని కాపుగల్లు, రెడ్లకుంట గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొదటగా సంఘ ఆర్థిక స్థితిగతులను రైతులకు వివరించారు. అనంతరం రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు నల్లారి రమేష్, ముత్తవరపు వీరయ్య, మల్లెల ఆదినారాయణ, బాలెబోయిన వెంకటేశ్వర్లు, మల్లెల రోశయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, గుండెబోయిన వీరబాబు, ఏజండ్ల సులోచన, పోలంపల్లి అచ్చమ్మ, మాజీ సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పరామర్శ

చివ్వెంల, సెప్టెంబరు 24: మండలంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఇటీవల మృతిచెందగా, ఆయా కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మండలంలోని పాండ్యానాయక్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దరావత్ వీరన్ననాయక్, వట్టిఖమ్మంపహాడ్‌కు చెందిన మాజీ సర్పంచ్ మట్టపల్లి నర్సమ్మ, ఐలాపురం గ్రామానికి చెందిన నక్కవీరస్వామి, కుడకుడకు చెందిన గుర్రం కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళుల్పంచి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ నాయక్, జీవన్‌రెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, గుర్రం సత్యనారాయణరెడ్డి, ప్రసాద్, బాబునాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు



ఎమ్మెల్యే సామేలు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

అర్వపల్లి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసే పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సంతోష్, లక్ష్మీరాం, బిక్కు, సోమ్లా, నర్సింహ, యాదగిరి, రవి, బుజ్జమ్మ, నిర్మల, మంగ, జ్యోతి, గుగులోతు భద్రు, ఎ.చిన్నమల్లయ్య, పోలెపాక ఎల్లమ్మ, వీరస్వామి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొడపిర్త అవిలయ్యయాదవ్‌పద్మ, దండ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కనకమ్మ, సత్తయ్య, కర్నాకర్, సోమయ్య, సైదులు, నర్సింహారావు, నర్సయ్య, వీరునాయక్, యాదగిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి పూజలు

అర్వపల్లి, సెప్టెంబరు 24: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ శివారు లోని అఖండ జ్యోతిస్వరూప శ్రీసూర్యనారాయణ క్షేత్రాన్ని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, వికాస్, శ్రీరాంపాండే పాల్గొన్నారు

కార్యకర్తలకు అండగా ఉంటా: గాదరి

తిరుమలగిరి, సెప్టెంబరు 24: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న తుంగతుర్తి మండలం మంచతండాకు చెందిన లకావత్ సోమ్లు, తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న ఇటీవల మృతి చెందగా, ఆయా కుటుంబ సభ్యులను మంజూరైన పార్టీ బీమా చెక్కులను తిరుమలగిరిలోని తన నివాసంలో అందజేసి మట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, తెడ్డు భాస్కర్, మద్దెల సందీప్ పాల్గొన్నారు.

'కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి'

కోదాడ రూరల్, సెప్టెంబరు 24: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ సెక్టార్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్షకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సరోజమ్మ, సైదమ్మ, కుడుముల మరియమ్మ, కందుకూరి సుగుణమ్మ, నాగమ్మ, చైతన్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 24: పట్టణంలోని గోవిందాపురం వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు ఏర్పాటుచేయాలని 9వ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు ధనమ్మ కోరారు. మంగళవారం పట్టణంలోని గోవిందాపురంలో రూ.2కోట్లతో నిర్మిస్తున్న వంతెన వద్ద పనులు పరిశీలించి మాట్లాడారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలు, వాహనాలు రాకపోకల కోసం డైవర్షన్ రోడ్డు ఏర్పాటుచేయాలన్నారు. వంతెన నిర్మాణం కోసం కల్వర్టును తొలగించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు భవిష్యత్‌పై లక్ష్యంతో చదవాలి



కేజీబీవీలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న షేక్ మీరా

గరిడేపల్లి, సెప్టెంబరు 24: ప్రతి విద్యార్థి భవిష్యత్‌పై లక్ష్యంతో చదవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి షేక్ మీరా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో బాలికల విద్యా ప్రాముఖ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలు నెరవేర్చాలన్నారు. పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి అవగాహన సాధించాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి వైశైలజ, ఉపాధ్యాయులు కల్పన, ఎం.సుహాసిని, బి.రమ, జి.సుశీల, వి.అనురాధ, ఎస్.కవిత, స్వప్నకుమారి, షాహిన్‌బేగం, బాలరక్ష భవన్ అధికారులు పాల్గొన్నారు.

సమాజసేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

కోదాడ టౌన్, సెప్టెంబరు 24: సామాజిక సేవలో విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు భాగస్వాములు కావాలని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, కష్టపడేతత్వం, సామాజిక సేవ అలవడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు యూనిట్లు సభ్యులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీలత,నిర్మల, వెంకటేశ్వర్‌రెడ్డి పీడీ ఫ్రాన్సిస్, అధ్యాపకులు, సైదులు, సైదమ్మ, రాజు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ పశ్య శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో జెండా ఆవిష్కరించారు. ఆ తర్వాత నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జక్కుల రమేష్, శిరీష, పిల్లలమర్రి శ్రీను, లక్ష్మణ్, రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోదాడలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

●యువకులు సేవాభావం కలిగి ఉండాలని హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రామారావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, బాలరాజు, నాగార్జున, నగేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 24: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాదారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు కాక పనులు చేసిన కాంట్రాక్టులకు బిల్లులు రాక అభివృద్ధి పనులు నిలిచి పోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. ఎజెండాలో పొందివర్చిన 13అంశాలను అమోదించామన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ సమస్యల గురించి కౌన్సిలర్లు గళమెత్తారు. ఈ సందర్భంగా పబ్లిక్‌హెల్త్ అధికారి డి.రమాదేవి వివరణ ఇస్తూ ప్రజలు ఇళ్ల నుంచి చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేస్తున్నందున మురుగునీరు మ్యాన్‌హోల్స్ నుంచి బయటికి వస్తున్నాయన్నారు. 44వ వార్డు కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో మిషన్ భగీరథ నీరు రోజుకు 21ఎంఎల్‌డీ అవసరం కాగా, 17ఎంఎల్‌డీ వాటర్ మాత్రమే సరఫరా అవుతుందన్నారు. వార్డుల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ బి. శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టకిశోర్, ఈఈ కిరణ్, బీజేపీ కౌన్సిలర్ పల్స మహాలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి'

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 24: జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఎకరం ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని అన్నారని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కోదాడ టౌన్, సెప్టెంబరు 24: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పుట్టిన రోజు వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, యశ్వంత్, శ్రీనివాసరావు, హనుమంతరావు, వెంకటేష్, నరేష్, హర్ష పాల్గొన్నారు.


వాచ్‌మన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాములు



మఠంపల్లి, సెప్టెంబరు 24: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల వాచ్‌మన్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ఏనుమళ్ల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం సర్వసభ్యుల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో బలపడుతున్న బీజేపీ: సంకినేని

భానుపురి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, సభ్యత్వ నమోదు కార్యక్రమ రాష్ట్ర ఇన్‌చార్జి రామచంద్రయ్య అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని 16వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్‌లోని 116, 117 బూత్‌లలో ఇంటింటికీ వెళ్ల బీజేపీ సభ్యత్వ నమోదును చేయించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంకినేని వరుణ్‌రావు, కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ,అబిద్ తదితరులు పాల్గొన్నారు.



భానుపురి: సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 మంది విద్యార్థులకు వృత్తి విద్య అధ్యాపకుడు జి.సతీష్ యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు యూనిఫాం అందించడం హర్షనీయమన్నారు. సతీష్‌ను అధ్యాపకులు అభినందించారు.

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్‌ను గంటల ప్రాతిపదికన బోధించడానికి ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, బీఈడీ చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు

●ఆత్మకూర్(ఎస్) మండలంలోని దండుమైసమ్మ ఆలయం వద్ద కొబ్బరి చిప్పల సేకరణ, పూలు, పండ్లు విక్రయించడానికి మంగళవారం వేలం పాట నిర్వహించారు. కొబ్బరి చిప్పల సేకరణ హక్కును రూ.3.53 లక్షలకు నెమ్మికల్‌కు చెందిన మహేష్ దక్కించుకున్నాడు. పూలు, పండ్లు విక్రయా నికి అదే గ్రామానికి చెందిన యడవెల్లి మధు రూ.3.20 లక్షలకు దక్కిం చుకున్నట్లు ఈవో కుశలయ్య తెలిపారు.

● ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని హుజూర్‌నగర్ మునిసిపల్ కమిషనర్ యాకుబ్ అన్నారు. 'స్వచ్ఛతా హీ' సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించి శ్రమదానం చేశారు. అనంతరం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్, రాజశేఖర్‌గౌడ్, లతీఫ్ పాల్గొన్నారు.

● క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ చరమందరాజు, ఎంఈవో సైదానాయక్ అన్నారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంలో హుజూర్‌నగర్ డివిజన్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చత్రునాయక్, అప్పయ్య, రవికుమార్, రామిశెట్టి శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలోని శ్రీ విజయదుర్గా దేవాలయంలో అక్టోబరు మూడో తేదీన నుంచి 13వ తేదీ వరకు దేవీ నవరాత్రుల మహోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి తెలిపారు.ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు..సమావేశంలో మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

మఠంపల్లి: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బానాల శ్రీనివాస్‌ను మండల గ్రామ పంచాయతీ కార్మికులు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు సైదానాయక్, సంఘం మండల నాయకులు ఉన్నారు.

●మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు

●'స్వచ్ఛతా హీ'లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బానాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో అధికారులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌నాయక్, ఏపీవో ఉమ, ప్రిన్సిపాల్ మంజుల, మౌనిక పాల్గొన్నారు.

కోదాడ: సైబర్ నేరాలపై యువత అప్రమతంగా ఉండాలని పట్టణ సీఐ రాము షీటీం సీఐ నీలిమ అన్నారు. పట్టణంలోని కిట్స్ కళాశాలలో షీ టీమ్స్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై, పోలీసు కళాబృందంతో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ గాంధీ, ఏఎస్ఐ కృష్ణమూర్తి, హెచ్‌సీ గోవిందు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో పాండురంగ అన్నారు. మండలంలోని గుడిబండలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత అధ్యక్షతన నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సామూహిక అన్నప్రాశన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి, పంచాయతీ కార్యదర్శి అహ్మదా, సిద్ధమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని కూచిపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా సామగ్రి కొనుగోలు చేయడానికి కాసాని వెంకటేశ్వర్లు రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులను బహూకరించారు.ఈ కార్యక్రమంలో పీడీ ప్రభాకర్, సుధాకర్, శ్రీనివాస్, సతీష్, మోతీలాల్ పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంజయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని కాల్వ ఒడ్డున ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన బాలెబోయిన పిచ్చయ్య దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, పూజారి రజినీకాంతఆచార్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి జి.ఉప్పలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, సోమయ్య, కృష్ణయ్య, లింగయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని డీడబ్ల్యూవో నర్సింగరావు అన్నారు. తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని 1, 7 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుతున్నాయా? అని అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ కందుకూరి మంగ, టీచర్లు శోభ, అండాలు ఉన్నారు.

●తిరుమలగిరిలో అండర్ పాస్ వంతెన నిర్మించొద్దంటూ అఖిలపక్ష నాయకులు, వ్యాపారులు మంగళవారం మునిపల్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, సుంకరి జనార్దన్, తన్నీరు రాంప్రభు, తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం నాయకుడు కాసా శంకర్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ సమావేశంలో మెంచు లింగమల్లు, వేర్పుల రఘు, రాచకొండ ఎల్లయ్య, వెంకటమల్లు, మహేష్(చిచ్చు)లింగయ్యకొండ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల, నూతనకల్: తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో మద్దిరాల, నూతనకల్ మండలాల నుంచి రేషన్ డీలర్లు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.హైదరాబాద్‌కు తరలిన వారిలో గూడ వంకట్‌రెడ్డి, చామకూరి పుల్లయ్య తాళ్లపల్లి పద్మ, సంధ్య, కాసోజు శంకర్, మారయ్య, అశోక్, రవి, జహంగీర్ ఉన్నారు.

పాలకవీడు: పండుగలకు రాయితీపై వంట నూనెలు రేషన్ దుకాణాల ద్వారా అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జానయ్య, పున్నయ్య, శ్రీను పాల్గొన్నారు.

పాలకవీడు, నేరేడుచర్ల: పాలకవీడు, నేరేడుచర్ల మండలాల యూటీఎఫ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. పాలకవీడు. అధ్యక్షుడిగా పగిళ్ల వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శిగా ఎల్. విజయశేఖర్, నేరేడుచర్ల అధ్యక్షుడిగా రెడ్డిపల్లి శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శిగా బుడిగె అక్కయ్యబాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆడిట్ కమిటీ కన్వీనర్ నల్లపు సాంబయ్య, నాగండ్ల నర్సింహారావు, శ్రీనివాసరావు, మధు, పరుశురాములు, వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీని మంగళవారం అర్వపల్లిలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాకి శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శిగా నోముల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎన్. వెంకన్న, మహిళ ఉపాధ్యక్షులుగా విజిత, కోశాధికారిగా శేఖర్, ఆడిటర్‌గా జె.నాగయ్యను ఎన్నుకున్నారు.

కోదాడ టౌన్: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోదాడకు చెందిన రౌతు కల్యాణ్‌ను నియమించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, కోదాడ కన్వీనర్ కనగాల నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

కోదాడ రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే టీఎస్ యుటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించి మాట్లాడారు.

భానుపురి, తిరుమలగిరి: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. అక్టోబరు 24న సూర్యాపేట జిల్లా కేంద్రంలో, హైదరాబాద్‌లో ఠాగూర్ ఆడిటోరియంలో, ఉస్మానియా యూనివర్శిటీలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల కరపత్రాలను సూర్యాపేటలో, తిరుమలగిరిలో ఆవిష్కరించి మాట్లాడారు.

సూర్యాపేట అర్బన్: పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.